క్లుప్తంగా

వెరీ గుడ్ వంశీ..!

– యువజన విభాగం సదస్సులో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రశంస



పార్టీ అధినేతను కలిసిన ఉదయ్‌వంశీ తదితరులు

తిరుపతి మంగళం : "తిరుపతి జిల్లాలో యువతను కలుపుకుని యువతపోరు వంటి ఉద్యమ పోరాట కార్యక్రమాలను బాగా చేస్తున్నారు.. వెరీగుడ్ వంశీ.. ఇలానే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమ పోరాటాలు చేయాలి" అని వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ తిరుపతి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఉదయ్‌వంశీతో పాటు యువజన విభాగం రాష్ట్ర నాయకులు మల్లం రవికుమార్‌రెడ్డి, నగర అధ్యక్షులు దినేష్‌రాయల్‌కు సూచించారు. మంగళవారం పార్టీ క్యాంప్ కార్యాలయంలో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన రాష్ట్ర స్థాయి పార్టీ యువజన విభాగం సమావేశంలో తిరుపతి నుంచి వీరితో పాటు మరికొందరు యువజన నాయకులు పాల్గొన్నారు. పార్టీకి యువత, విద్యార్థి విభాగాలే కీలకమని పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని యువతకు అధినేత మార్గదర్శనం చేశారని ఉదయ్‌వంశీ తెలిపారు.

ఓటేరులో పింఛన్లు పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి రూరల్: పేదలకు ప్రతి నెలా ఇచ్చే సామాజిక భద్రత పెన్షన్లను అర్హులైన లబ్ధిదారులకు ఉదయాన్నే సచివాలయం సిబ్బంది పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం తిరుపతి రూరల్ ఓటేరు పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన ఆయన పలువురు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. జిల్లాలో జూన్ నెలకు సంబంధించి 2,59,732 మంది ఫించన్ దారులకు సుమారు 111.45 కోట్ల రూపాయలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, ఎంపీడీఓ రామచంద్ర, సచివాలయం సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో పలు కార్యక్రమాలను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ ఆకస్మికంగా సందర్శించారు. మంగళవారం ఉదయం చిన్నగొట్టిగల్లులో సామాజిక పింఛన్లు పంపిణీని, అనంతరం చిన్నగొట్టిగల్లు జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే డిజిటల్ విద్యా బోధన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపీలో ఉన్న రోగులతో మాట్లాడారు. డీఎల్‌పీఓ సురేష్‌నాయుడు, తహశీల్దార్ భాగ్యలక్ష్మీ, ఎంపీడీఓ గిడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీఓ సోమశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

గాయకుడికి సత్కారం

తిరుపతి కల్చరల్: గాయకుడు, ఘంటసాల వీరాభిమాని సోము ఉమాపతిని రాయలసీమ రంగస్థలి ప్రతినిధులు మంగళవారం శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. ప్రతి నెల 1న ఘంటసాల అభిమానులు వీవీ మహల్ సర్కిల్లోని ఆయన విగ్రహానికి పాలాభిషేకం చేసి కళాకారులు, గాయకులను సత్కరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోము ఉమాపతిని సత్కరించి రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడారు. పలువురు ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం

తిరుపతి సిటీ: విద్యార్థుల సమస్యలపై పోరాటాలకు ఏపీ స్టూడెంట్స్ జేఏసీ సిద్ధంగా ఉందని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ తెలిపారు. ఆయన 2025–26 నూతన అకడమిక్ ఇయర్‌లో పలు కోర్సులలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సంబంధించి స్వాగత పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. విద్యాసంస్థల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్ రెడ్డి, కార్యదర్శి సురేష్ యాదవ్, నగర అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి జ్యోతి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తగినట్లు పాఠాలు చెప్పాలి

పాకాల: విద్యార్థుల సామర్థ్యాలకు తగినట్లుగా పాఠాలు చెప్పాలని ఎంఈఓ బాబ్జి తెలిపారు. మంగళవారం మండలంలోని నడింపల్లి, గుడివారిపల్లి, నేంద్రగుంట ఎంపీపీ పాఠశాలలను ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు రాసిన వర్క్‌బుక్స్‌ను పరిశీలించి మాట్లాడారు. హెచ్‌ఎంలు పుష్పలత, ప్రతిభ, ఉపాధ్యాయులు దేవి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంగా భాస్కర్‌రావు

తిరుపతి అర్బన్: మంగళం డిపో మేనేజర్ భాస్కర్‌రావు తిరుపతి సెంట్రల్ బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎం)గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏటీఎం డీఆర్ నాయుడు ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలోకి మంగళం డీఎంను బదిలీ చేశారు. మరోవైపు పుంగనూరు డీఎం సుధాకర్‌ను మంగళం డీఎంగా నియమించారు.

మనోడైతే చాలు అదే మండలంలో ఉద్యోగం!

- గగ్గోలు పెడుతున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు
- బదిలీల్లో సిఫార్సుల జోరు
- న్యాయం కోసం కోర్టును ఆశ్రయిస్తామంటున్న బాధితులు



తిరుపతి అర్బన్: సచివాలయ ఉద్యోగుల బదిలీలు ఇష్టారాజ్యం చేశారని ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల అంశాన్ని ఆయా విభాగాలకు చెందిన జిల్లా అధికారులకు బదిలీల బాధ్యతలు అప్పగించారు. అయితే ఆ అధికారులు నిబంధనలు పక్కన బెట్టి సిఫార్సులకే ప్రాధాన్యత ఇచ్చారనే విమర్శలొస్తున్నాయి. మనోడైతే చాలు అదే మండలంలోనే ఉద్యోగం ఇచ్చేశారు. నిబంధనల ప్రకారం సచివాలయ గ్రామ, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లను ఆ మండలంలో కాకుండా మరో మండలానికి బదిలీ చేయాల్సి ఉంది. అయితే జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ విక్రమకుమార్‌రెడ్డి ప్రసుత్తం పనిచేస్తున్న మండలంలోనే పలువురికి అవకాశం కల్పించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

అదే మండలంలో పోస్టింగ్!

ఉదాహరణకు రేణిగుంట మండలం గురవరాజుపల్లె సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అదే మండలంలోని తూకివాకం-1 సచివాలయానికి, తూకివాకం-2 వెల్ఫేర్ అసిస్టెంట్‌ను గురువరాజుపల్లె సచివాలయానికి బదిలీ చేశారు. అలాగే చంద్రగిరిలో పనిచేస్తున్న వారిని అదే మండలంలోని మిట్టపాళెంకు, తూకివాకం-1లోని ఉద్యోగిని విప్పమానుపట్టెడకు బదిలీ చేశారు. మరోవైపు 30కి పైగా వెల్ఫేర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికి 25 మందికి పోస్టింగ్ ఇవ్వకుండా రేషన్‌లైజేషన్ క్రమంలో ఖాళీలు లేవని చెప్పడంపై విమర్శలొస్తున్నాయి. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించడానికి ఉద్యుక్తులవుతున్నట్టు తెలుస్తోంది.

> **బదిలీలు పారదర్శకమే**
>
> సచివాలయ పరిధిలో పనిచేస్తున్న 234 మంది వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీ పారదర్శకంగానే చేపట్టాం. కొందరికి మంచి ర్యాంకులు ఉండడంలో వారికి ప్రాధాన్యత ఇచ్చాం. మరికొందరికి ఆరోగ్య సమస్యల నేపథ్యంలో అవకాశం కల్పించాం. మరోవైపు రేషన్‌లైజేషన్ నేపథ్యంలో ఖాళీలు లేకపోవడంతో మరో 20 మందికి పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. వారికి ఏదో ఒకచోట పోస్టింగ్ ఇస్తాం. సిఫార్సులు, లంచాలకు ఛాన్సు లేకుండా బదిలీలు నిర్వహించాం.
>
> – విక్రమకుమార్‌రెడ్డి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్

బదిలీలు గందరగోళం

- నిబంధనలకు పాతర
- ఆందోళన వ్యక్తం చేస్తున్న సచివాలయ సెక్రటరీలు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీలు గందరగోళంగా మారాయి. ఐదేళ్లు పూర్తి చేసుకున్న సెక్రటరీలను మరో ప్రాంతంలోని వార్డుకు బదిలీ చేస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 102 సచివాలయాల్లో బదిలీలకు అధికారులు పూనుకున్నారు. సీనియారిటీ, ర్యాంకులు ఆధారంగా సచివాలయ సెక్రటరీలను బదిలీ చేయాల్సి ఉంది. అయితే అధికారులు ఇష్టారాజ్యంగా బదిలీలను చేయడంపై విమర్శలొస్తున్నాయి. దీనిపై మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు కొంతమంది సెక్రటరీలు ఫిర్యాదు చేశారు. బదిలీలు అన్యాయంగా ఉన్నాయని, వెంటనే వాటిని నిలుపుదల చేసి సీనియారిటీ ఆధారంగా బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. . ఈ బదిలీలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది.

ఆందోళన తప్పదంటున్న సెక్రటరీలు

ఇప్పటి వరకు పూర్తి చేసిన బదిలీలను మరోసారి పునః సమీక్షించాలని, నిబంధనలు, అర్హతలను పక్కన పెట్టి కొంతమంది అధికారులు చేస్తున్న బదిలీలపై ఆందోళన చేస్తామని సచివాలయ సెక్రటరీలు హెచ్చరిస్తున్నారు.

కమిషనర్ ఆగ్రహం

వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీలు వివాదాస్పదం, ఆరోపణలమయం కావడంతో కమిషనర్ మౌర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం సంబంధిత అధికారులు, సిబ్బందితో ఆమె అత్యవసర సమావేశం నిర్వహించారు. వారిపై తీవ్ర స్థాయిలో ఆమె మండిపడ్డారు. నిబంధనల ప్రకారం బదిలీలను ఎందుకు చేయలేదని కమిషనర్ ప్రశ్నించినట్లు తెలిసింది. సంబంధిత సిబ్బందిపై కన్నెర చేసిన కమిషనర్ మెమో జారీ చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిబంధనల ప్రకారం బదిలీలు చేపడుతామని సెక్రటరీలకు హామీ ఇచ్చారు.

కంచి పీఠాధిపతులకు వీడ్కోలు

రామచంద్రాపురం: విజయ యాత్రలో భాగంగా ప్రాణ యోగ ఆశ్రమానికి వచ్చిన శ్రీకంచి కామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతికి మంగళవారం సాదర వీడ్కోలు పలికారు. విజయ యాత్రలో భాగంగా కంచి పీఠాధిపతులు శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామి, శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివార్లు వారం రోజులపాటు ఆశ్రమంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మంగళవారం విజయ యాత్ర ముగించుకొని కంచికి బయల్దేరారు.

ఘనంగా ఉత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మండల పరిధిలోని రాయలచెరువు కట్ట సమీపంలో వెలసిన శ్రీశక్తి పీఠంలో మంగళవారం శ్రీవారాహీ దేవి నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, శ్రీబృహత్ వారాహీ దేవి మంత్ర హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

హనుమంతునిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి హనుమంత వాహనంపై శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి విహరించి భక్తులను ఆశీర్వదించారు. బుధవారం గరుడ వాహనంపై స్వామివారు విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు.

పుష్పయాగానికి అంకురార్పణ



ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతున్న విష్వక్సేనులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఈనెల 2న బుధవారం నిర్వహించనున్న పుష్పయాగానికి మంగళవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సాయంత్రం సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. విష్వక్సేనులు ఆలయ మాడ వీధుల్లో విహరించిన తర్వాత అర్చక పండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు సతీసమేత శ్రీగోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం



పీఎండీఎస్ కిట్లను పరిశీలిస్తున్న ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం

తిరుపతి రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయం సాగును మొదటగా పీఎండీఎస్ విధానంతోనే ప్రారంభించాలని తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయం సాగు ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం అన్నారు. తిరుపతి రూరల్ మండలం వేమూరు గ్రామంలో మంగళవారం రైతు అయ్యప్ప నాయుడుకు చెందిన బి.ఆర్.సి కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు సిబ్బందితో కలిసి పరిశీలన చేశారు. అనంతరం ప్రకృతి సాగులో ఉత్పత్తి చేసిన 30 రకాల విత్తనాలతో 200 పీఎండీఎస్ కిట్లు తయారు చేశారు. అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, భూలక్ష్మి ఎఫ్‌పీఎస్ సీఈఓ డాక్టర్ గంగాధరం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మధు, గీతా రాణి, శ్రీదేవి, హరికృష్ణ, ఐసీఆర్‌పీలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



ఎస్ఆర్ఐ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చిన్న గోవిందు

తిరుపతి రూరల్: సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు అన్నారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ఐ కాలేజీ విద్యార్థులకు మంగళవారం సైబర్ నేరాలు – వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. నైతిక విలువలతో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణాలపై చర్యలు



వార్డులో కార్పొరేటర్ అనీష్, అధికారులతో కలసి పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: అనుమతులు లేకుండా నగరంలో నిర్మిస్తున్న భవనాలు, నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం 45వ వార్డులోని శివజ్యోతినగర్, ప్రగతి నగర్, అయ్యప్ప కాలనీ, అంధుల శరణాలయం తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య, అభివృద్ధి పనులను కార్పొరేటర్ అనీష్ రాయల్, పలు శాఖల అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. స్థానికులు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, పోలీసుల సాయంతో వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రగతి నగర్, అయ్యప్ప కాలనీల్లో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బైపాస్ రోడ్డులోని ఓరియన్ హోటల్ నుంచి మురుగు కాలువల్లో వ్యర్థాలను కలువకుండా చర్యలు తీసుకోవాలని హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌ను ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ నమూనా హోటల్లో మాంసాహార అపచారం



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

తిరుపతి కల్చరల్: రాజమండ్రి హైవేపై శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ నమూనాతో రాయుడు మిలిటరీ హోటల్ ఏర్పాటు చేసి అందులో మాంసాహార వంటకాలు విక్రయించడం దుర్మార్గమని, టీటీడీ అధికారులు తక్షణం స్పందించి ఆలయ నమూనాను తొలగించి చర్యలు తీసుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు చీనేపల్లి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై ప్రశ్నిస్తే శ్రీవేంకటేశ్వరస్వామి తమ కులదైవమని హోటల్ యాజమాన్యం చెప్పడం విడ్డూరమన్నారు. శ్రీవారి ఆలయ నమూనాను తీసుకుని ద్వారం ముందు జయవిజయలను కూడా ప్రతిష్ఠించి లోపల మాంసాహారం విక్రయాలు చేయడం శోచనీయమని నిరసించారు. టీటీడీ అధికారులు తక్షణం స్పందించి ధర్మాన్ని అపహాస్యం చేస్తున్న ఇలాంటి సంఘటనలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హిందూ చైతన్య వేదిక నేత కుమార స్వామి, భజరంగదళ్ నేత కిరీటి, సాయిబాలు పాల్గొన్నారు.

నాగయ్య సేవలు స్ఫూర్తిదాయకం



నాగయ్యకు నివాళులు అర్పిస్తున్న ఎస్సీ షెడ్యూల్డ్ కులాల సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా దళితుల పక్షాన నిలిచి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఏపీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కదిరి మంగళం నాగయ్య సేవలు పలువురికీ స్ఫూర్తిదాయకమని విశ్రాంత జడ్జి గుర్రప్ప అన్నారు. మంగళవారం అంబేడ్కర్ భవన్‌లో నాగయ్య 92వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్సీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి నాగయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించి విశ్రాంత జడ్జి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెంగల్రాయులు, కార్యదర్శి కోబాకు భూపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్, కోశాధికారి ధనంజయులు, ఉపాధ్యక్షుడు ఆర్కే భట్టా, సహాయ కార్యదర్శులు జయరాం, గంగాధరం, సుబ్రమణ్యం, గురవయ్య, గోపి, శేషాద్రి, నాగయ్య కుటుంబ సభ్యులు వెంకటప్రసాద్, దీపక్ పాల్గొన్నారు.

జాతీయ మార్కెట్‌లో జీఎస్టీ కీలకం



మాట్లాడుతున్న సీజీఎస్టీ కమిషనర్ ఆనందకుమార్

తిరుపతి అన్నమయ్యసర్కిల్: పరోక్ష పన్ను వ్యవస్థను సరళతరం చేసి ఒకే జాతీయ మార్కెట్ దిశగా జీఎస్టీ కీలకపాత్ర వహిస్తుందని సీజీఎస్టీ కమిషనర్ ఆనందకుమార్ అన్నారు. 'పన్నుల సరళీకరణ–పౌరులను సాధికారత పరచడం' అనే అంశంపై మంగళవారం స్థానిక జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిపూర్ణత, పారదర్శకత, సమర్థతతో కూడిన పన్ను పరిపాలనకు శాఖ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, అదనపు కమిషనర్ దినకరన్, జాయింట్ కమిషనర్ అంబే మాట్లాడారు. వివిధ పరిశ్రమల నుంచి ఎంపికైన సంస్థల అత్యుత్తమ సేవలు, పన్నుల సమ్మతికి గుర్తింపుగా ప్రోత్సాహక సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు.

చెవిరెడ్డి పేరిట దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



దుర్గమ్మ ఆలయం వద్ద చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ నేతలు, పాకాల నాయకులు

తిరుపతి రూరల్/పాకాల: అమ్మా.. దుర్గమ్మా.. చెవిరెడ్డి కుటుంబాన్ని అక్రమ కేసుల నుంచి కాపాడు తల్లీ.. అంటూ చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ నేతలు ప్రార్థించారు. విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లిన పార్టీ నేతలు మంగళవారం అమ్మవారిని దర్శించుకుని చెవిరెడ్డి పేరిట అర్చన చేయించారు. ఆయనకు మంచి జరగాలని, అక్రమ కేసుల నుంచి త్వరగా బయటకు తీసుకువచ్చేలా ఆశీస్సులివ్వాలని వేడుకున్నారు. అంతకు ముందు జైలు నుంచి కోర్టుకు తీసుకువచ్చే క్రమంలో చెవిరెడ్డిని చూసిన పార్టీ నేతలు ఆయన్ను కలిసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. 'అన్నా.. ధైర్యంగా పోరాడుదాం.. మీ వెంట మేమున్నాం..' అంటూ నినదించారు. కార్యక్రమంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, చంద్రగిరి మండల పార్టీ అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ హరికృష్ణ, యశ్వంత్, తుంటి సుధాయాదవ్, వైఎస్ఆర్ సీపీ డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, రైతు నాయకుడు భాస్కర్‌నాయుడు, మునిరత్నరెడ్డి, రహీం, వినాయక, లింగయ్య, నాగూర్, మణి, భాను, ప్రదీప్, నబీ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన స్విమ్స్ కార్మికులు



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తిరుపతి తుడా: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న స్విమ్స్ ఆస్పత్రి కార్మికులు మంగళవారం గంటపాటు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ, కొన్నేళ్లుగా స్విమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు పలు సమస్యలపై పోరాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా వారి న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో పోరాటం తీవ్రమవుతుందని హెచ్చరించారు.

ఘనంగా 'డాక్టర్స్ డే'



ఎస్వీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభును సన్మానిస్తున్న అతిథులు



ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను సన్మానిస్తున్న రష్ ఆస్పత్రి వైద్య బృందం

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆధార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. దైవం వైద్యుల రూపంలో ప్రజలకు సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రాధ వినతిపై ఆయన స్పందించారు. రూయ హాస్పిటల్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన సిల్వర్ జూబ్లీ ఆడిటోరియాన్ని ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు.. అనంతరం సూపరింటెండెంట్‌తోపాటు ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు, వివిధ విభాగాల డాక్టర్లను తుడా చైర్మన్, అతిథులు ఘనంగా సత్కరించారు. ట్రాఫిక్ సీఐ సంజీవ్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పని చేయాలి

తిరుపతి కల్చరల్: వైద్యులు సేవా దృక్పథంతో పని చేస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రణీత్ పెనుమాడు పిలుపునిచ్చారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం వేమన విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రాజారెడ్డి ప్రారంభించారు. ఆయనతోపాటు ప్రణీత్ మాట్లాడారు. వైద్య రంగంలో విశేష సేవలు అందించిన డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ యుగంధర్, స్విమ్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.వనజాక్షమ్మ, స్విమ్స్ సీఎంఓ డాక్టర్ పి.శివశంకర్, డాక్టర్ ఎంఎస్. బాలాజీలను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. శిబిరంలో రక్తదానం చేసిన 26 మందికి పండ్లు, సర్టిఫికెట్లు అందజేశారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ సీనియర్ డాక్టర్ రాజారెడ్డి



రక్తదానం

కార్యక్రమంలో పంచముఖేశ్వరరావు, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, డాక్టర్ రవీంద్ర, శ్రీధర్ వికటం, మునిలక్ష్మి, తహసున్నీసా బేగం, రాజేష్, ప్రభాకర్, జయశంకర్, రెడ్డెప్ప, రఫీ, మోహన్‌రావు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో..

తిరుపతి తుడా: స్విమ్స్‌లో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, వైద్యాధికారులు, పలువురు వైద్యులు డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే ఈఎస్ఐ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని రష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్వహించిన డాక్టర్స్ డే వేడుకల్లో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.



స్విమ్స్‌లో ప్రసంగిస్తున్న వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్



ఈఎస్ఐలో..

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

తిరుపతి రూరల్: చిగురువాడ గ్రామ పంచాయతీలో కార్యదర్శి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించిన గ్రామసభకు సర్పంచ్ గైర్హాజరు కావడం చర్చకు దారి తీసింది. పలు అంశాలు, ప్రతినెలా జమ ఖర్చుల వివరాలను నోటీస్ బోర్డులో ప్రకటించడం తదితర విషయాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాముఖ్యత కల్పించాలని వార్డు సభ్యులు ముచ్చేలి కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

పాడుబడిన గృహాల్లో గంజాయి బ్యాచ్



యువకులను అదుపులోకి తీసుకున్న ఈగల్ టీం సిబ్బంది

చంద్రగిరి: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సేవిస్తున్న యువకులపై పోలీసు శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. మంగళవారం తిరుచానూరు సమీపంలోని హోటల్ గ్రాండ్ రిడ్జ్ సమీపంలోని ఓ పాడుబడ్డ బంగ్లాలో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను డ్రోన్ సాయంతో స్పెషల్ పార్టీ పోలీసులు గుర్తించారు. పక్కా ప్రణాళికతో బంగ్లా చుట్టూ పోలీసు నిఘా ఉంచి యువకులు ఎటూ పారిపోకుండా వారిపై దాడులు చేసి ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి పీల్చే గొట్టంతోపాటు వారి వివరాలను సేకరించి, తిరుచానూరు పోలీసులకు అప్పగించారు.

స్విమ్స్‌లో మొక్కలు నాటారు

తిరుపతి తుడా: స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పద్మావతి హాస్పిటల్ ఆవరణలో వన మహోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్, వైద్యులు ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. వారం రోజులు పలురకాల మొక్కలు నాటినట్లు వీసీ చెప్పారు.

నగరంలో నేడు

- తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు స్వామి వారికి శత కలశాభిషేకం.
- కొత్తవీధిలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా జాబ్ మేళా.
- స్విమ్స్ శ్రీపద్మావతి హాస్పిటల్‌లో ఉదయం 10 గంటలకు పర్యావరణంపై అవగాహన కార్యక్రమం.
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్దనున్న విష్ణు నివాసం, అలిపిరి వద్దనున్న భూదేవి కాంప్లెక్‌లో తిరుమలకు శ్రీవారిమెట్లు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ.